గౌడవెల్లిలో మైసమ్మ బోనాలు


బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్: మండలంలోని గౌడవెల్లి గ్రామస్తులు ఆదివారం మైసమ్మ బోనాల పండుగను ఘనంగా జరుపుకున్నారు.మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. మాజీ ఎంపీపీ పద్మ జగన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రాజు, నాయకులు మద్దుల శ్రీనివాస్ రెడ్డి, రందీప్‌రెడ్డి, రాజ్‌గోపాల్‌రెడ్డి, గోమారం శ్రీనివాస్‌రెడ్డి, సంతోష్‌భాను, సింహాల్ యాదవ్ తదితరులు ఉత్సవాల్లో పాల్గొన్నారు.

ఉద్యోగం రాలేదని యువతి ఆత్మహత్య

ఉప్పల్: ఉద్యోగం రాలేదని నిరుద్యోగ యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సాయిరాంనగర్ ప్రాంతానికి చెందిన బండపల్లి ఎల్లబాయి కూతురు, అల్లుడు చనిపోవడంతో వారి ఇద్దరు కూతుళ్లు సాత్విక(22), బావిష్క (16)లను తానే పోషిస్తుంది. సాత్విక కొద్ది రోజులుగా ఉద్యోగాన్వేషణలో ఉంది. ఎన్ని ప్రయత్నాలు చేసినా ఉద్యోగం రాకపోవడంతో మనస్తాపం చెంది శనివారం రాత్రి ఇంట్లోని గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. అమ్మమ్మ ఎల్లబాయి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. మృత దేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

తవ్వి వదిలేశారు..!

- ఇష్టారాజ్యంగా కంకర, మట్టి, గుట్టల తవ్వకాలు
- లోయలు, కుంటలను తలపిస్తున్న క్వారీ గుంతలు
- తరచూ ప్రమాదాలు.. నిండు ప్రాణాలు బలి
- తాజాగా అంకిరెడ్డిపల్లి క్వారీ గుంతలో పడి విద్యార్థి మృతి
- నగర శివారుల్లో 110 క్వారీలున్నా.. అనధికారివే ఎక్కువ


అంకిరెడ్డిపల్లిలో తవ్వకాలు పూర్తయి లోయగా మారిన కంకర క్వారీ

సాక్షి,మేడ్చల్ జిల్లా: నగర శివారుల్లో క్వారీ గుంతలు తవ్వి పూడ్చకపోవడంతో అవి ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. నిబంధనల ప్రకారం తవ్వకాలు పూర్తయిన వెంటనే అక్కడి గుంతలను మట్టితో పూడ్చాల్సి ఉంటుంది. కానీ వాటిని పట్టించుకోవాల్సిన భూగర్భగనుల శాఖ ఏమీ పట్టనట్లుగా వ్యవహరిస్తుండడంతో అమలుకు నోచుకోవడం లేదు. ఫలితంగా క్వారీ గుంతల్లో తరచుగా ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే శుక్రవారం కీసర మండలం అంకిరెడ్డిపల్లిలోని క్రషర్ క్వారీ వద్ద స్నేహితుడు బర్త్ డే సందర్భంగా ఫొటోలు దిగేందుకు వెళ్లిన ఇంటర్ విద్యార్థి అభినవ్ ప్రమాదవశాత్తు క్వారీ గుంతలో పడిపోయి మృతి చెందారు. ఇవే గాకుండా నగర శివారుల్లో చాలా క్వారీలను ఇలాగే వదిలేయడంతో అవి లోయలు, కుంటలను తలపిస్తున్నాయి. బస్తీలు, పల్లెలకు సమీపంతో పాటు రోడ్లకు పక్కనున్న క్వారీల గుంతలతో తరచుగా ప్రమాదాలు సంభవించడంతో పాటు ప్రజల ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. 2 ఎకరాల విస్తీర్ణంలోని పదుల మీటర్ల లోతులో ఉన్న గుంతలు మరింత ప్రమాదకరంగా మారుతున్నాయి. దీంతో చుట్టు పక్కల పల్లెలు, బస్తీ ప్రజలు ఈ ప్రాంతాల్లో నివసించాలంటేనే భయపడుతున్నారు. దుండిగల్, కీసర, ఘట్‌కేసర్, శామీర్‌పేట, మేడ్చల్, మేడిపల్లి మండలాల పరిధిలోని కంకర క్వారీల్లోనూ గతంలో ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన కూలీలు క్వారీ గుంతల్లో పడి మృతి చెందిన ఘటనలూ కూడా ఉన్నాయి. క్వారీ గుంతల్లో జరిగే ప్రమాదాలు పోలీస్‌స్టేషన్లలో కేసు నమోదైతే తప్ప బయటపడడం లేదు. బయట పడని ప్రమాదాలు కూడా అనేకం ఉన్నట్లు తెలుస్తోంది. ఇదేగాకుండా క్యారీల్లో నిల్వ నీరు ఆకుపచ్చ రంగులోకి మారి జల కాలుష్యం జరిగి పక్కనున్న గ్రామాలు, బస్తీల ప్రజలు కూడా అనారోగ్యం బారిన పడుతున్నారు.

గుట్టలు మాయం


నగర శివారుల్లో ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన కొండల (గుట్టల) ఆనవాళ్లు లేకుండాపోతున్నాయి. గుట్టలన్నీ కరిగిస్తూ వచ్చిన మాఫియా కన్ను ఇప్పుడు మట్టి రవాణాపై పడుతోంది. రేయింబవళ్లూ మట్టిని తవ్వి.. తరలిస్తూ రూ. లక్షల్లో సంపాదిస్తున్నారు. పొక్లెయిన్లతో తవ్వకాలు చేస్తూ.. టిప్పర్ల ద్వారా తరలిస్తూ గుట్టల ఆనవాళ్లు లేకుండా చేస్తున్నారు. మట్టిని రవాణా చేస్తున్న వ్యక్తులకు పలువురి రాజకీయ నేతలు అండదండలు ఉండడంతో సంబంధిత అధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో ప్రకృతి వనరులు ధ్వంసమవడమే కాకుండా వ్యాపారులు రూ. లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నారు. మరో వైపు మైనింగ్ శాఖకు రాయల్టీ రూపంలో రావాల్సిన డబ్బులు కూడా రాకుండా పోతోంది.

మట్టి రవాణా చేయాలంటే..

మట్టి రవాణా చేయాలంటే.. నిబంధనల ప్రకారం మొదట మైనింగ్ శాఖ ఏడీకి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటోంది. వారు దరఖాస్తు పరిశీలనకు రెవెన్యూశాఖకు పంపిస్తోంది. అక్కడి నుంచి ఎన్వోసీ వచ్చిన తరువాత మళ్లీ దరఖాస్తును మైనింగ్ శాఖకు నివేదిస్తారు. మైనింగ్ శాఖ సిబ్బంది మళ్లీ క్షేత్రస్థాయికి వెళ్లి మట్టి రవాణాకు అనుకూలమా లేదా పరిశీలించి అనుమతి ఇవ్వాల్సి ఉంటోంది.

పర్యావరణానికి దెబ్బ

కంకర తవ్వకాలతో గుట్టలన్నీ మాయమవడంతో పర్యావరణకు ప్రమాదం ముంచుకువస్తోంది. లీజు పేరిట సాగుతున్న అక్రమ దందాలో నిబంధనల ఉల్లంఘనలే కనిపిస్తున్నాయి. గ్రామ, పట్టణ రెవెన్యూ పరిధిలో పట్టా భూములున్న రైతుల దగ్గర లీజు అగ్రిమెంట్లు చేసుకోవడం, మైనింగ్ శాఖ నుంచి తవ్వకాలకు అనుమతులు పొంది కంకర తరలించడం ఏళ్లుగా సాగుతోంది. ప్రభుత్వ భూములను లీజు తీసుకుని క్వారీ నడిపిన కాంట్రాక్టర్లు పనులు పూర్తి కాగానే.. రెవెన్యూ శాఖకు అప్పగించడంతో.. వాటికి రక్షణ కంచెలు వేయకుండానే వదిలి పెడుతున్నారు. గాజుల రామారం, కుత్బుల్లాపూర్, రాంపల్లి ప్రాంతాల్లో క్వారీ పనులు పూర్తయిన తర్వాత ఆ గుంతలను చెత్తతో నింపగా, అవి డంపింగ్ యార్డులను మరిపిస్తున్నాయి. నిజాంపేట, మౌలాలీ, అంకిరెడ్డిపల్లి, పోచారం, కీసర ప్రాంతాల్లోని క్వారీల గుంతలు పచ్చని నీటితో కుంటలను తలపిస్తున్నాయి. ప్రైవేట్ భూములను లీజుకు తీసుకుని క్వారీలు నడిపిన కాంట్రాక్టర్లు కూడా వాటిని గాలికి వదిలి వేస్తున్నారు.


పోచారంలో తవ్వకాలు పూర్తయి లోయగా మారిన కంకర క్వారీ

శివారుల్లో అనాధికార క్వారీలే ఎక్కువ..

నగర శివారుల్లో అధికారికంగా 110 క్వారీలు ఉండగా, అనాధికారికంగా రెటింపు స్థాయిలో నడుస్తున్నట్లు తెలుస్తోంది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని కీసర, మేడ్చల్, శామీర్‌పేట, ఘట్‌కేసర్ మండలాల పరిధిలో 36 క్వారీలు నడుస్తుండగా, రంగారెడ్డి జిల్లా పరిధిలో 74 క్వారీలు కొనసాగుతున్నాయి. లీజు పేరిట ఏళ్ల తరబడి కంకర తవ్వకాలు చేపట్టి రూ. లక్షలు కూడబెట్టుకున్న వ్యాపారులు నిబంధనలకు నీళ్లు వదులుతున్నారు. దీంతో లీజు పూర్తయిన క్వారీలన్నీ పెద్ద గుంతలు, లోయలుగా మారి ప్రమాదాలకు నిలయాలవుతున్నాయి.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి


ఘట్‌కేసర్‌లో మాట్లాడుతున్న శ్రీనివాస్, అరుణ్‌కుమార్

ఘట్‌కేసర్: అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కాంగ్రెస్ ఎస్సీ సెల్ మున్సిపాలిటీ అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన పూలమాల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశాన్ని అన్ని రంగాల్లో మొదటిస్థానంలో నిలపాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. కార్యక్రమంలో దాసు, అశోక్‌గౌడ్, నర్సింగ్‌రావు, నారాయణ, శ్రీనివాస్, రాజేశ్‌కుమార్, వెంకటేశ్వరరావు, సత్యం, కల్యాణ్, రాజు, అంజయ్య పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు


ఆర్‌ఎల్‌నగర్ సమీపంలో స్తంభాన్ని ఢీకొట్టిన కారు

కీసర: నాగారం మున్సిపల్ పరిధిలోని ఆర్‌ఎల్‌నగర్ ప్రధాన రహదారిపై శనివారం అర్ధరాత్రి కారు బీభత్సం సృష్టించింది. కీసర సీఐ వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం .. నాగారం నుంచి రాంపల్లి వైపు వస్తున్న ఇకో స్పోర్ట్స్ కారు (టీఎస్06 ఈఈ 2885) వేగంగా వచ్చి ఆర్‌ఎల్‌నగర్ సమీపంలో విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో కరెంట్ సరఫరాకు అంతరాయం కలిగింది. కారులో ఉన్న కార్తీక్ భరద్వాజ్, కౌశిక్ భరద్వాజ్ స్వల్పగాయాలతో బయటపడ్డారు. క్రేన్ సహాయంతో ఆదివారం ఉదయం కారును బయటకుతీశారు. విద్యుత్ అధికారులు నూతన స్తంభాన్ని ఏర్పాటుచేసి సరఫరాను పునఃరుద్ధరించారు. కాగా ప్రమాదానికి అతివేగం కారణమా..? లేక మద్యం తాగి కారు నడపడం వల్లే ప్రమాదం జరిగిందా..? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

మేడ్చల్: మండలంలోని నూతన్‌కల్ గ్రామ చెరువులో పడి మతిస్థిమితం లేని వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మస్కూరి నవీన్ (37) మృతదేహన్ని ఆదివారం ఉదయం గ్రామస్తులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు.దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహన్ని వెలికి తీసి బంధువులకు అప్పగించారు. నవీన్ మతి స్థిమితం లేకపోవడంతో మూడు నెలలుగా ఆసుపత్రిలో చికిత్స పొందాడు. శనివారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి శవమై చెరువులో తేలాడు. మేడ్చల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ మానవ హక్కుల సంఘం జిల్లా నూతన కార్యవర్గం


మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా నూతన కార్యవర్గం

అల్వాల్: జాతీయ మానవ హక్కుల సంఘం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా నూతన కార్యవర్గాన్ని సంఘం అధ్యక్షుడు ఎంయుదువా ఆధ్వర్యంలో నియమించారు. అధ్యక్షుడిగా (చీఫ్) డాక్టర్ ప్రదీప్, ప్రధాన కార్యదర్శిగా రితీష్ రాజ్, సంయుక్త కార్యదర్శులుగా గజానంద్, రాజ్‌కుమార్‌రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శిగా మరుపల్లి రాహుల్, ప్రెస్ కార్యదర్శిగా నరేందర్‌సింగ్, ఆఫీసర్ అధికారిగా దుర్గాప్రసాద్, నిహారిక, రిపోర్టింగ్ అధికారిగా అభిలాష్‌రెడ్డి, ప్రచార కార్యదర్శిగా హరీష్, శ్రీకృష్ణ, శరణ్‌కుమార్‌లను నియమించగా ప్రధాన పోషకుడిగా అడ్వకేట్ ఏఎస్.రావు, ముఖ్య సలహాదారుడిగా నర్సింగ్‌రాజ్, న్యాయ సలహాదారుగా కరుణాకర్ వ్యవహరిస్తారు.

పార్లమెంట్ ఎన్నికల్లో మద్దతు ఇవ్వండి


కాలనీలో పర్యటిస్తున్న పట్నం సునీతామహేందర్‌రెడ్డి

మేడ్చల్: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని మల్కాజ్‌గిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డి కోరారు. గుండ్లపోచంపల్లిలోని ఊర్జిత, 1,2 కాలనీలు, మున్సిపాలిటీలోని వివిధ కాలనీల్లో కాలనీవాసులతో ఆదివారం సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడితే తనను ఎంపీగా గెలిపించి పార్లమెంట్‌కు పంపితే నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో మరిన్ని పథకాలు రావాలంటే ఎంపీలుగా కాంగ్రెస్ వారే ఉండాలన్నారు. ఆయా సమావేశాల్లో నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేశ్‌యాదవ్, కౌన్సిలర్ సాయిపేట శ్రీనివాస్, శ్రీలత రెడ్డి, జడ్పీటీసీ శైలజావిజయానందరెడ్డి, మాజీ సర్పంచ్‌లు ఈశ్వర్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతల ఇంటింటా ప్రచారం

కీసర: నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీలతో పాటు, కీసర మండలంలోని వివిధ గ్రామాల్లో కాంగ్రెస్ నేతలు ఆదివారం ప్రచారం చేపట్టారు. చీర్యాల, కీసర గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పట్నం సునీతారెడ్డిని గెలుపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా పార్టీ మండలాధ్యక్షుడు కోళ్ల కృష్ణాయాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ రామిడి విజయ్‌రెడ్డి మాట్లాడుతూ పేదల కోసం అనేక పథకాలు అమలుచేస్తున్న కాంగ్రెస్‌కు ప్రజలు అండగా నిలవాలన్నారు. నాగారం పట్టణంలో కూడా ప్రచారం కొనసాగించారు. ఇక్కడ మున్సిపల్ వైస్ చైర్మన్ బండారి మల్లేశ్‌యాదవ్, నాగారం పట్టణాధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఈసారి మల్కాజ్‌గిరి పార్లమెంట్‌ను కైవసం చేసుకొని సీఎం రేవంత్‌రెడ్డికి కానుకగా అందజేస్తామన్నారు. కార్యక్రమంలో తటాకం వెంకటేశ్, జూపల్లి రవీందర్, కందాడి శివరాంరెడ్డి, తటాకం అభిలాష్, అరుంధతి, శివలింగాల శ్రీనివాస్‌గౌడ్, పెద్ద జంగయ్య, తటాకం లక్ష్మణ్, ముద్దం వెంకట్, మధుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.


చీర్యాలలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

భర్తతో గొడవ పడి గర్భిణి అదృశ్యం

ఉప్పల్: భర్తతో గొడవ పడి ఓ గర్భిణి అదృశ్యమైంది. ఈ సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రామంతాపూర్ వెంకటరెడ్డినగర్ ప్రాంతానికి చెందిన సాయి పవన్, అనుష(26)లకు సంవత్సరం క్రితం వివాహం జరిగింది. ప్రస్తుతం అనుష ఆరు నెలల గర్భిణి. పుట్టింటికి వెళ్తానని భర్తతో చెప్పగా అంగీకరించలేదు. దీంతో భర్త బయటకు వెళ్లగా ఇంట్లో నుంచి చెప్పకుండా వెళ్లిపోయింది. పుట్టింటికి కూడా వెళ్లలేదు. దీంతో అనుష తండ్రి ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

భార్యతో గొడవ పడి భర్త..

రామంతాపూర్ ఆర్టీసీ కాలనీకి చెందిన లక్ష్మణ్ (36), భార్య కవిత ఈ నెల 18 న గొడవపడ్డారు. దీంతో కవిత పుట్టింటికి వెళ్లిపోయింది. తిరిగి 20 న ఇంటికి రావడంతో అప్పటికీ భర్త ఇంట్లోలేడు. ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వస్తుంది. దీంతో కవిత ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

దూరవిద్య మంచి అవకాశం

జీడిమెట్ల: దూరవిద్య ద్వారా చదివిన విద్యార్థులు సైతం పట్టుదలతో చదివితే అనుకున్నది సాధించవచ్చని వివేకానంద విద్యా మందిర్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆదివారం పాఠశాలలోని దూరవిద్య స్కూల్‌లో పదో తరగతికి కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు హాల్ టికెట్లు జారీ చేశారు. అనివార్య కారణాలతో.. ఆర్థిక ఇబ్బందులతో పాఠశాలకు దూరమైన విద్యార్థులకు దూరవిద్య కోర్సు ద్వారా చదువుకునేందుకు మంచి అవకాశం కల్పిస్తుందని తెలిపారు. ఇంకా ఎవరైనా విద్యార్థుల దూరవిద్యా కోర్సు ద్వారా పదో తరగతి పరీక్షలు రాయాలనుకుంటే వివేకానంద పాఠశాలలోని స్టడీ సర్కిల్‌లో సంప్రదించాలని సూచించారు. విద్యార్థులకు హాల్ టికెట్లు అందజేసిన వారిలో పాఠశాల కరస్పాండెంట్ సునీత, వైస్ ప్రిన్సిపాల్, నాలెడ్జ్ హైస్కూల్ ప్రిన్సిపాల్ రాజేశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'హామీల అమలులో విఫలం'


మాట్లాడుతున్న రాష్ట్ర అంబేడ్కర్ సంఘాల అధ్యక్షుడు రాపోలు రాములు

కీసర: గత పదేళ్లలో రాష్ట్రం, కేంద్రంలో ఉన్న అధికారంలో ఉన్న బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమయ్యాయని రాష్ట్ర అంబేడ్కర్ సంఘాల అధ్యక్షుడు రాపోలు రాములు అన్నారు. కీసరలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి రాగానే అవినీతిని అంతమొందించి విదేశాల్లో ఉన్న నల్లధనాన్ని తీసుకొచ్చి ప్రతి పౌరుడి ఖాతాలో రూ 15 లక్షలు వేస్తామని ప్రధాని నరేంద్రమోదీ హామీనిచ్చి ఒక్కపైసా కూడా వేయలేదన్నారు. ఇక రాష్ట్రంలో మొదటి దళితుడిని సీఎం చేస్తానని మాట ఇచ్చి తర్వాత కేసీఆర్ మాటమార్చారని మండిపడ్డారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్‌కు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. మండల అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు కొమ్ము సుదర్శన్, ప్రధాన కార్యదర్శి తుడుం శ్రీనివాస్, కోశాధికారి శ్యాంకుమార్, కార్యదర్శులు నవీన్, సంతోష్, నాయకులు నర్మద, పరమేశ్, సుధాకర్, రమేశ్ పాల్గొన్నారు.

'దళితులను అవమానిస్తే బుద్ధి చెబుతాం'



ఘట్‌కేసర్‌లో మాట్లాడుతున్న సాయన్నమాదిగ, కృష్ణమాదిగ

ఘట్‌కేసర్: దళితులను అవమానిస్తే పార్లమెంట్ ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామని తెలంగాణ మాదిగ జేఏసీ నాయకులు టీఎండీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయన్న మాదిగ, మాదిగ జేఏసీ అధికార ప్రతినిధి ఎర్రవెల్లి కృష్ణమాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు అంజయ్యమాదిగ హెచ్చరించారు. పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ మేడ్చల్ నియోజకవర్గంలో దళిత సీనియర్ నాయకుడు రాపోలు రాములను కాంగ్రెస్ పార్టీ, నియోజకవర్గ, జిల్లా నాయకులు అవమాన పరుస్తున్నారన్నారు. బోడుప్పల్ ఎంపీటీసీగా, 1994లో బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేసి మాజీ మంత్రి దేవేందర్‌గౌడ్‌కు గట్టి పోటీ ఇచ్చారని గుర్తు చేశారు. దళిత నాయకుడికి సముచిత స్థానం ఇవ్వాలని లేకుంటే పార్లమెంట్ ఎన్నికల్లో తడాఖా చూపుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నర్సింగ్‌రావు, సతీశ్‌మాదిగ, లక్ష్మణ్ తదతరులు పాల్గొన్నారు.

ముగిసిన శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవ వేడుకలు


పౌరాణిక పద్య నాటక ప్రదర్శన

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ హనుమాన్‌పేట సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక కమ్యూనిటీహాలులో గత ఐదు రోజుల నుండి జరుగుతున్న శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా ముగిశాయి. చివరి రోజు ప్రత్యేక కార్యక్రమాలతో పాటు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓటెయ్యండి

- బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ సతీమణి జమున
- నాయకులతో కలిసి ప్రచారం


సమావేశంలో మాట్లాడుతున్న ఈటల జమున

మేడ్చల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి ఓటేయ్యాలని మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటెల రాజేందర్ సతీమణి జమున కోరారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని స్టెర్లింగ్ హోమ్స్‌లో స్థానిక నాయకులతో కలిసి ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదేళ్లలోనే ప్రధాన మంత్రి నరేంద్రమోదీ దేశాన్ని ప్రపంచంలోనే శక్తివంతమైన దేశంగా తీర్చిదిద్దారన్నారు. దేశంలో రహదారులు, ఫ్లైఓవర్ల నిర్మాణం, కరోనా కాలంలో ఉచిత వ్యాక్సిన్ అందజేశారని గుర్తుచేశారు. అలాగే అవినీతీ లేని పాలన, మహిళలు, నిరుపేదలకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారని పేర్కొన్నారు. ఈటల రాజేందర్ మచ్చ లేని నాయకుడని తెలంగాణ రాష్ట్ర సాధనకు ఉద్యమం చేసిన నాయకుడని, రాష్ట్రం కోసం ఎన్నో త్యాగాలు చేశాడని అన్నారు. నిత్యం ప్రజల కోసం పరితపించే నాయకుడు ఈటల అని ఆయనకు మల్కాజ్‌గిరి నుంచి ఎంపీగా అవకాశం కల్పించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మోహన్‌రెడ్డి, కౌన్సిలర్లు మల్లికార్జున్‌ముదిరాజ్, సరస్వతీరెడ్డి, మున్సిపాలిటీ అధ్యక్షుడు ఉసిగారి శ్రీనివాస్ ముదిరాజ్ నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

నాగారం మున్సిపల్‌పరిధిలో..

కీసర: నాగారం మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డుల్లో నాగారం మున్సిపల్ బీజేపీ యువమోర్చా నాయకుడు కౌకుట్లరాహుల్‌రెడ్డి మోర్చా నాయకులతో కలిసి ఆదివారం ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతకు మేలు జరగాలంటే కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. అందరికీ అందుబాటులో ఉండే ఈటల రాజేందర్‌ను భారీ మెజార్టీతో గెలుపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రచారంలో స్థానిక బీజేపీ నేతలు, యువమోర్చా నాయకులు పాల్గొన్నారు.

అంకుషాపూర్‌లో..

ఘట్‌కేసర్: మండలంలోని అంకుషాపూర్ గ్రామంలో బీజేపీ మండలాధ్యక్షుడు ప్రవీణ్‌రావు ఆధ్వర్యంలో నాయకులు ఆదివారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కమలం పువ్వు గుర్తుకు ఓటేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కరుణాకర్, బూత్ అధ్యక్షులు సుధాకర్, రాంరెడ్డి, విజయ్, లక్ష్మారెడ్డి, నితిన్‌రెడ్డి, చందు, గౌస్ పాల్గొన్నారు.


నాగారంలో ప్రచారం చేస్తున్న బీజేపీ యువ మోర్చా నాయకుడు కౌకుట్ల రాహుల్‌రెడ్డి


అంకుషాపూర్‌లో ప్రచారం చేస్తున్న ప్రవీణ్‌రావు, కరుణాకర్


విద్యార్థి దశ నుంచే లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి


వేడుకలను ప్రారంభిస్తున్న చెస్ క్రీడాకారిణి హారిక, హెచ్‌సీఏ అధ్యక్షుడు


నృత్యం చేస్తున్న విద్యార్థులు


కుషాయిగూడ: విద్యార్థి దశ నుంచే లక్ష్యాన్ని నిర్దేశించుకొని ఆ దిశగా సాధన చేయాలని ప్రముఖ చెస్ క్రీడాకారిణి ద్రోణవల్లి హారిక అన్నారు. కుషాయిగూడలోని అక్షర ఇంటర్నేషనల్ స్కూల్ వార్షికోత్సవ వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు, పాఠశాల చైర్మన్ జగన్మోహన్‌రావుతో కలిసి ప్రారంభించారు. చదువుతో పాటుగా విద్యార్థుల అభిరుచులకు తగ్గట్టుగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రోత్సాహం అందించాలన్నారు. అప్పుడే వారి అనుకున్న లక్ష్యానికి చేరువవుతారన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

భిన్నత్వంలో ఏకత్వం దేశం గొప్పతనం



మేడ్చల్: దేశంలో 140 కోట్లకు పైగా జనాభా ఉన్న భిన్నత్వంలో ఏకత్వంగా ఉంటూ గొప్ప దేశంగా వెలుగోతుందని వివిధ మత పెద్దలు అన్నారు. మేడ్చల్‌లోని ఇస్లామియా సెంటర్‌లో ఆదివారం సాయంత్రం నిర్వహించిన ఈద్ మిలాప్ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. విభిన్న వర్ణాలు, జాతులు, మతాలు, కలిసి మెలిసి జీవనం సాగిస్తుండడం మన దేశం గొప్పతనమని అన్నారు. అన్ని మతాల పండుగల సందర్భంగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. సమావేశంలో మత పెద్దలు బిస్మిల్లా రహమనార్ రహీం, నయిమొద్దీన్, షాకీర్ అలీ, రవికుమార్, ప్రేందాస్, బాబురాజ్ పాల్గొన్నారు.

శరవేగంగా బతుకమ్మ కుంట పనులు


భూదేవి హిల్స్‌లో నిర్మిస్తున్న బతుకమ్మ కుంటకు సంబంధించిన ప్లాన్

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలో భూదేవిహిల్స్‌లో నిర్మిస్తున్న బతుకమ్మ కుంట పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రూ.20 లక్షలతో అన్ని హంగులతో ఈ నిర్మాణం చేట్టనున్నట్లు గాజులరామారం ఏఈ తిరుపతి తెలిపారు. అడ్డం 14 మీటర్లు, నిలువు 16 మీటర్ల స్థలం చుట్టూ ఎంఎస్ రేలింగ్, గేట్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అలాగే లోపల ప్లాట్ ఫాంతో పాటు 5 మీటర్ల చుట్టూ గుండ్రంగా నీరు నిలిచేందుకు రేన్‌ఫోర్స్‌డ్ సిమెంట్ కాంక్రీట్‌తో బతుకమ్మలు వేసేందుకు 0.75 లోతుతో నిర్మాణం చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసకుంటామని పేర్కొన్నారు. ఎప్పటి నుంచో కలగా ఉన్న ఈ బతుకమ్మ కుంట పనులు ప్రారంభమవడంతో స్థానిక ఆర్‌జీకే, కూనా మహాలక్ష్మీనగర్, భూదేవి హిల్స్ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.